సాక్షి విశాఖపట్నం

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



నేటి నుంచి ఏక్తా పర్వ ఉత్సవాలు

కేంద్రీయ విద్యాలయం - 2లో గురువారం నుంచి రాష్ట్రీయ ఏక్తా పర్వ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 8లో



నూకాంబిక నూతన తేజం

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు గురువారం ప్రారంభమవుతున్నాయి. 8లో

మట్టి గణపతి కేరాఫ్ సంతపేట



ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన గణపతి విగ్రహాలకు ప్రత్యామ్నాయంగా మట్టి గణపతి ప్రతిమలకే ఉత్సవ కమిటీలు ప్రాధాన్యమిస్తున్నాయి. 8లో

న్యూస్‌రీల్

10న గవర్నర్ అరకు పర్యటన



సాక్షి, పాడేరు: రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ఈనెల 10వ తేదీన అరకులోయలో పర్యటిస్తున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 10.25 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖ నుంచి గవర్నర్ బయలుదేరి 11 గంటలకు అరకులోయలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 11.30 గంటలకు రైల్వే అతిథి గృహానికి చేరుకొని, అక్కడ నుంచి పద్మాపురం గార్డెన్‌కు వెళ్తారన్నారు. అక్కడి ట్రీకాస్టిల్‌తోపాటు గిరిజన మ్యూజియాన్ని గవర్నర్ సందర్శిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సుంకరమెట్ట కాఫీతోటలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. అక్కడి నుంచి 1.15 గంటలకు బయలుదేరి అరకు ఏపీటీడీసీ అతిథి గృహానికి చేరుకుంటారని తెలిపారు. 1.50 గంటలకు విశాఖపట్నం తిరుగు ప్రయాణమవుతారని పేర్కొన్నారు.

కిరండూల్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ గోరాపూర్-అరకు-సిమిలిగుడ సెక్షన్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్ పనుల నిమిత్తం కేకే లైన్‌లో ప్రయాణించే కిరండూల్ పాసింజర్ స్పెషల్ రైలును ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నంలో ప్రతీరోజు బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు, కిరండూల్‌లో ప్రతీ రోజు బయల్దేరే కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు రద్దయినట్లు పేర్కొన్నారు.

10 నుంచి కార్పొరేటర్ల అధ్యయన యాత్ర

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్పొరేటర్లు ఈ నెల 10 నుంచి అధ్యయన యాత్ర చేపట్టనున్నారు. అమృత్‌సర్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, తాగు మురుగునీటి వ్యవస్థల నిర్వహణపై అధ్యయనం చేయనున్నారు. అమృత్‌సర్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం కానున్నారు. అలాగే పెహల్‌గం, డాల్‌లేక్ బోటింగ్, సోనామార్గ్, జోజిల్లా, జీరో పాయింట్, తాజ్‌వాస్, కాత్రా, మాతా వైష్ణోదేవి టెంపుల్, గోల్డెన్ టెంపుల్, జలియన్ వాలా బాగ్, ఇండో-పాక్ వార్ బోర్డర్ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తారు.

ఇదీ షెడ్యూల్..

ఈ నెల 10న ఇక్కడి నుంచి బయలుదేరి.. అదే రోజు సాయంత్రం 4 గంటలకు శ్రీనగర్ చేరుకుంటారు. 11న శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శిస్తారు. 12న శ్రీనగర్ నుంచి బయలుదేరి జోజిల్లా, జీరోపాయింట్, తాజ్‌వాస్ సందర్శించి అక్కడ అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. 13న రోడ్డు మార్గంలో కాత్రా చేరుకుంటారు. 14న కాత్రాలో మాతా వైష్ణోదేవి టెంపుల్, 15న అమృత్‌సర్‌లో గోల్డెన్ టెంపుల్, జలియన్‌వాలాబాగ్, ఇండో-పాక్ బోర్డర్‌ను సందర్శిస్తారు. 16న అమృత్‌సర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించిన అనంతరం ఢిల్లీ చేరుకుంటారు. అక్కడ వ్యక్తిగత పనులు చూసుకుని.. అనంతరం విశాఖ రానున్నారు.

రేపు మెగా జాబ్‌మేళా



కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఆర్కే హాస్పిటల్, క్వెస్ ఎన్నార్సై, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఎంజీఎం క్యాన్సర్ హాస్పిటల్, అపోలో ఫార్మసీ హీరో మోటో కార్ప్స్, హెటిరో డ్రగ్స్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, టీసీఎల్-సీఎల్‌వోటీ, ఇండస్, కేర్ హాస్పిటల్, సెవెన్ హిల్స్ హెల్త్ కేర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 665 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. బిల్లింగ్, కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మాసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ రిప్రెసెంటేటివ్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, కార్పెంటర్, వెర్‌హౌస్ అసోసియేట్స్, టీం లీడర్స్, ఓటీ స్క్రబ్ నర్స్, ఇన్‌చార్జ్ నర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గొడౌన్ ఇన్‌చార్జ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 20-40 ఏళ్ల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. జీతం నెలకు రూ.12,500 నుంచి రూ.32,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నంద నందనా





రాధాకృష్ణులకు పూజలు చేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు

- కనులపండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- గోపాలుడి వేషధారణలో అలరించిన చిన్నారులు

బీచ్‌రోడ్డు: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా ఉదయం వేదమంత్రాల నడుమ బాలకృష్ణుడికి గంగ, యమునా, గోదావరి, సరస్వతి, నర్మదా, సింధు, కావేరి నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలు, పళ్ల రసాలు, పంచామృతాలు, పంచగవ్యాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించ భక్తదాస శ్రీ కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బాల గోపాలుడికి ఉయ్యాల సేవ నిర్వహించగా, భక్తులు ఈ సేవలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులతో 108 మార్లు హరేకృష్ణ మహామంత్రం జపం చేసే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దంపతులు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తదితరులు బాలగోపాలుడిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రముఖ గాయకులు చైతన్య బ్రదర్స్, పోలుపల్లి సత్యనారాయణమూర్తి, సోమయాజులు, విష్ణు ప్రియా ఇందిర, డాక్టర్ సరస్వతి బృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు భక్తులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఉట్టి మహోత్సవంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణుడిపై అడిగిన పలు ప్రశ్నలకు భక్తులు సమాధానం చెప్పారు.



ఉయ్యాల సేవలో మేయర్ హరివెంకట కుమారి



చూడముచ్చటగా బాలకృష్ణులు, గోపికలు



ఉట్టికొట్టేందుకు సిద్ధమవుతున్న గోపాలుడు



నదీజలాలతో కృష్ణయ్యకు అభిషేకం

ఆ.. బాలగోపాలం

సీతంపేట: బాలకృష్ణులంతా ఒక్కచోటకు చేరడంతో ద్వారకా నగర్‌లోని శ్రీకృష్ణ విద్యామందిర్.. బృందావనాన్ని తలపించింది. బుడి బుడి అడుగులు, బుంగమూతులతో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. సంస్కారభారతి ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు కనులపండువగా జరిగాయి. పాఠశాల ఆవరణలో బాలగోకులం పేరిట నిర్వహించిన శ్రీకృష్ణ వేషధారణ పోటీల్లో పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొని అలరించారు. నెలల శిశువు నుంచి పదేళ్ల వయసు ఉన్న పిల్లలు బలరామకృష్ణులు, గోపికలు, రాధాకృష్ణులు వేషధారణతో ఆకట్టుకున్నారు. పద్యాలు, భగవద్గీతలోని శ్లోకాలు అనర్గళంగా చెప్పారు. పాఠశాల మైదానంలో ఉట్టి కొట్టడానికి విద్యార్థులు పోటీ పడ్డారు. ముందుగా శ్రీకృష్ణుడికి పూజ చేశారు. నారాయణీయం పేరిట భాగవతంలోని పలు ఘట్టాలను కళ్లకు కట్టేలా వేషధారణలతో ప్రదర్శించారు.



ఉట్టిపడిన ఉత్సవం



చిన్నారుల ఉట్టి సంబరం

స్టేడియం అభివృద్ధికి ప్రణాళికలు

- ఇంజినీరింగ్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం
- క్వీన్ విక్టరీ విగ్రహం ఆధునికీకరణకు ఉత్తర్వులు



మున్సిపల్ స్టేడియంను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

జగదాంబ : ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ జోన్-4 పరిధి జీవీఎంసీ 35, 39 వార్డుల్లో గల ఇందిరా ప్రియదర్శిని క్రికెట్ స్టేడియం, పాతపోస్టాఫీసు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ స్టేడియంలో ఉన్న భవనాన్ని ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. స్టేడియంలో పారిశుధ్యం లోపించిందని, ఆర్వో ప్లాంట్, మెకానికల్ విభాగానికి చెందిన వ్యర్థాలు అధికంగా ఉన్నాయన్నారు. వెంటనే వాటిని మెకానికల్ విభాగానికి అప్పగించాలని జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు. అనంతరం జీవీఎంసీ 39వ వార్డు పాతపోస్టాఫీసు ప్రాంతంలో పర్యటించిన ఆయన క్వీన్ విక్టోరియా విగ్రహాన్ని సందర్శించి ఆధునికీకరించాలన్నారు. పాతపోస్టాఫీసు వద్ద 80 అడుగులు లేదా 100 అడుగుల రోడ్డు విస్తరణకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే పాత పోస్టాఫీసు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్, వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ వార్డులో శిథిలావస్థకు చేరిన రిజిస్ట్రార్ కార్యాలయ స్థానంలో కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్, థియేటర్ నిర్మించాలని కోరారు. తద్వారా పాతనగరం అభివృద్ధికి నోచుకుంటుందన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీరింగ్ అధికారి సత్యనారాయణరాజు, వినయ్‌కుమార్, కార్య నిర్వాహక ఇంజినీర్లు సంతోషి, సుధాకర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ అధికారి వినయ్‌కుమార్, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు గోవిందనాథ్‌రెడ్డి, ఎస్ఎస్ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కులతో ఉపాధి కల్పన

- స్థానిక యువకులకే ఉద్యోగావకాశాలు
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- రైతులకు రూ.28 కోట్ల పరిహారం అందజేత



రైతులకు భూ పరిహార చెక్కులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి


ఆనందపురం : రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ పార్కులు) నెలకొల్పడానికి ఏర్పాట్లు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కణమాంలో ఏపీఐఐసీకి భూములు అందించిన వంద మంది రైతులకు బుధవారం రూ.28 కోట్ల పరిహార చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని యువకులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. ఇటీవలే జగన్నాథపురంలో గ్రేహౌండ్స్ నిమిత్తం భూములు అందించిన రైతులకు రూ.15 కోట్లు చెల్లించామని తెలిపారు. కణమాంలో ఏపీఐఐసీ సేకరించిన 157 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటుతోపాటు, ఎంఎస్ఎంఈ పార్కు కూడా ఏర్పాటు చేయనున్నామని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనివల్ల ఆనందపురం మండలంలో వందలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందని, ముఖ్యంగా ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన వారికి ఉపాధి మెరుగవుతుందన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేశారన్నారు. నాలుగున్నరేళ్లలో భీమిలి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రూ.3,700 కోట్లు వ్యయం చేయగా ఆనందపురం మండలంలో రూ.400 కోట్లు ఖర్చు పెట్టారని వివరించారు. భీమిలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావును మళ్లీ మంచి మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ కణమాం గ్రామంలో గల భూములను గత టీడీపీ ప్రభుత్వం సేకరించినా రైతులకు పరిహారం అందించకుండా అన్యాయం చేసిందన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో రైతులకు న్యాయం జరిగిందన్నారు. టీడీపీ, ఇతర పార్టీల నాయకులు సెల్ఫీ ఛాలెంజ్‌లతో కాలక్షేపం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చూస్తున్నారని, ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జేసీ విశ్వనాథన్, ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ ఆబోతు అప్పలరాము, డీటీ రాజేష్, శొంఠ్యాం సహకార సంఘం అధ్యక్షుడు కాకర్లపూడి వరహాల రాజు, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, నాయకులు పినిశెట్టి సింహాచలం నాయుడు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, యర్ర అప్పలనాయుడు, పిన్నింటి వెంకటరమణ, లెంక రాంబాబు పాల్గొన్నారు.

వుమెన్ స్టార్టప్ హబ్ @ ఐఐఎంవీ

- మహిళా పారిశ్రామికవేత్తలకు ఐఐఎంఐ ప్రోత్సాహం
- మహాత్మాగాంధీ ఫెలోషిప్ పొందిన 9వ ఐఐఎంగా రికార్డు
- 90కి పైగా మహిళల స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సౌకర్యం
- 14 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్స్ ఏర్పాటుకు ప్రణాళికలు



ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్



ఐఐఎంవీలో మహిళా పారిశ్రామికవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-విశాఖపట్నం(ఐఐఎంవీ) విభిన్న ఆలోచనలతో ముందుకెళ్తోంది. మహాత్మాగాంధీ నేషనల్ ఫెలో షిప్ పొందిన 9వ ఐఐఎంగా చరిత్ర పుటల్లోకెక్కిన ఐఐఎంవీ.. మహిళల కోసం ప్రత్యేకంగా వుమెన్ స్టార్టప్ హబ్‌ను ప్రారంభించింది. ఇప్పటికే 90 మందికిపైగా మహిళల స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సౌకర్యాన్ని కల్పించింది. మరోవైపు మూడు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 14 జిల్లాల్లో స్టార్టప్ హబ్‌లు ఏర్పాటుకు సన్నద్ధమవుతోంది.

రెండేళ్ల సుదీర్ఘ ఫెలోషిప్‌తో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంలో భాగంగా అవసరమైన శిక్షణ, వనరులను సృష్టించే మహాత్మాగాంధీ నేషనల్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ (ఎంజీఎన్ఎఫ్)ని ఐఐఎంవీ దక్కించుకుంది. ఇందుకు ఎంపికైన 75 మంది యువత ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో ఆయా కలెక్టర్ల వద్ద అండర్ స్టడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక స్టార్టప్ హబ్‌లను ఏర్పాటు చేయడంలో ఐఐఎం విశాఖపట్నం విజయవంతంగా వ్యవహరిస్తోంది.

మహిళల కలలు సాకారం

ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ (గ్రూప్-3 సెంటర్(జీ3సీ) ఇంక్యుబేటర్‌ను మంజూరు చేసింది. నిబంధనల ప్రకారం ఈ సెంటర్‌ను సెక్షన్-8 కంపెనీగా నిర్వహించాల్సిన నేపథ్యంలో ఐఐఎంవీ ఫౌండేషన్ ఫర్ ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూరియల్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఐఎంవీ ఫీల్డ్)ను ఏడాదిన్నర కిందట ప్రారంభించింది. ఈ సెంటర్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 90కిపైగా మహిళల నేతృత్వంలోని ఇక్కడ స్టార్టప్‌లు పురుడుపోసుకున్నాయి. తాజాగా 36 మంది మహిళా పారిశ్రామికవేత్తలతో మరో వుమెన్ స్టార్టప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలు తమ కలలను సాకారం చేసుకునే దిశగా సహకారం తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ స్టార్టప్‌లలో పలు సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి.

డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్‌లకు శ్రీకారం

మరోవైపు.. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 14 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఐఐఎంవీ సన్నద్ధమవుతోంది. క్యాంపస్ అధికారులు ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపించగా.. వారి నుంచి సూత్రప్రాయంగా ఆమోదం లభించింది. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, సామర్థ్య నిర్మాణానికి కృషి చేయడంతో పాటు వన్ నేషన్ వన్ ప్రొడక్ట్ ను ప్రోత్సహించేందుకు కూడా డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్‌లు ఉపయుక్తంగా నిలుస్తాయని క్యాంపస్ డైరెక్టర్ ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు.

రైతుబజార్లకు సరికొత్త హంగులు!

- శిథిలమైన ఏళ్ల క్రితం నాటి పైకప్పులు
- ఆస్బెస్టాస్ రేకుల స్థానంలో జింక్ షీట్లు
- వాటి మార్పుతో పాటు చిన్న చిన్న మరమ్మతులు
- ఇందుకు మార్కెటింగ్ శాఖకు రూ.1.48 కోట్ల వ్యయం



కొత్త జింక్ షీట్లు అమరుస్తున్న సిబ్బంది



నరసింహనగర్ రైతుబజారులో శిథిల పైకప్పు తొలగింపు

సాక్షి, విశాఖపట్నం: రైతుబజార్లలో ఏళ్ల క్రితం వేసిన పైకప్పులు శిథిల స్థితికి చేరుకున్నాయి. వర్షాలు కురిసినప్పుడల్లా స్టాళ్లలో ధారలు కారుతున్నాయి. దీంతో స్టాళ్లలో అమ్మకాలు సాగించే రైతులు, కొనుగోలు చేసే వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాదు.. రైతుబజార్ల పరిసరాలన్నీ చిత్తడిగా మారుతున్నాయి. విశాఖ నగర పరిధిలో సీతమ్మధార, నర్సింహనగర్, ఎంవీపీకాలనీ, మర్రిపాలెం, గోపాలపట్నం, గాజువాక, పెందుర్తి, ములగాడ, స్టీల్‌ప్లాంట్, పెదగంట్యాడ, మధురవాడ, పెదవాల్తేరు, కంచరపాలెంలలో రైతుబజార్లున్నాయి. ఈ నేపథ్యంలో 13 రైతుబజార్లలో పరిస్థితి మెరుగు పడేలా మార్కెటింగ్ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందుకు రూ.1.48 కోట్లు వెచ్చిస్తోంది. ఈ నిధులతో రైతుబజార్లలో శిథిలమై ఉన్న షెడ్ల పైకప్పులను తొలగించి కొత్తవి వేస్తున్నారు. ప్రస్తుతం వీటికి ఆస్బెస్టాస్ రేకులు (పైకప్పులు) ఉన్నాయి. ఇప్పుడు వాటి స్థానంలో టెర్రాకోట్ జింక్ షీట్లను అమరుస్తున్నారు. ఇంకా రైతుబజార్లలో చిన్న చిన్న మరమ్మతులు చేపడుతున్నారు. మరుగుదొడ్లు, నీటి సరఫరా, మంచినీటి ట్యాంకు, పైప్‌లైన్‌లు, రైతుబజార్లలో పరిశుభ్ర వాతావరణం నెలకొనేందుకు అవసరమైన పనులు కూడా చేయిస్తున్నారు. ఇలా ఒక్కో రైతుబజారుకు అవసరాన్ని బట్టి రూ.5 నుంచి 20 లక్షల వరకు వెచ్చించనున్నారు. నిధుల లభ్యతను బట్టి రైతుబజార్లలో స్టాళ్లకు రంగులు కూడా వేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులు యోచిస్తున్నారు. దీంతో విశాఖ నగర పరిధిలోని రైతుబజార్ల రూపురేఖలు మారనున్నాయి. రెండు నెలల్లోపు ఈ రైతుబజార్లలో పైకప్పులు మార్చడానికి, అవసరమైన హంగులు సమకూర్చడానికి, మరమ్మతులు పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని మార్కెటింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగరాజు 'సాక్షి'కి చెప్పారు.

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	500.00
విజయనగరం	504.00
శ్రీకాకుళం	504.00

మట్టి గణపతి కేరాఫ్ సంతపేట

- పర్యావరణ ప్రేమికుల ఆసక్తితో పెరిగిన డిమాండ్



అర్డర్ల ప్రకారం తయారు చేసిన మట్టి విగ్రహాలు



మట్టితో అచ్చు వేసిన చిన్న విగ్రహాలు



మట్టి విగ్రహం తయారీలో కళాకారుడు

తగరపువలస: పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన గణపతి విగ్రహాలకు ప్రత్యామ్నాయంగా మట్టి గణపతి ప్రతిమలకే ఉత్సవ కమిటీలు ప్రాధాన్యమిస్తున్నాయి. రంగులతో తయారు చేసిన విగ్రహాలు నెలల తరబడి నదులు, చెరువులు, సముద్రాలలో కరగకుండా ఉండిపోవడంతో కాలుష్యం పెరిగిపోయి జీవుల మనుగడకు ప్రమాదం వాటిల్లుతోంది. అంతేకాకుండా తీర ప్రాంతాలు వ్యర్థాలతో జుగుప్సాకరంగా మారుతున్నాయి. దీంతో మట్టి గణపతులను ఇళ్లల్లో, మండపాల్లో పూజించడానికి భక్తులు సన్నద్ధమవుతున్నారు. మట్టి గణపతులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టితో పెట్టుకుని జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేట కుమ్మరివీధికి చెందిన అరటికోట్ల గణేష్, అరటికోట్ల రాంబాబు, పొట్నూరు ప్రసాద్ తయారీకి శ్రీకారం చుట్టారు. ఆర్డర్లు, ఉత్సవ కమిటీల ప్రతినిధుల అభిరుచి మేరకు వీటిని 2 నుంచి 9 అడుగుల ఎత్తు వరకు తయారు చేస్తున్నారు. ఈ మట్టి విగ్రహాలకు ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ నుంచి మేలైన చెరువు మట్టి, ఊక, వరిగడ్డి తీసుకొచ్చి వినియోగిస్తున్నారు. రూ.2వేలు మొదలుకుని రూ.25వేల వరకూ విలువైన విగ్రహాలు తయారు చేస్తున్నారు.

చిన్న బొమ్మలకు అచ్చు వేస్తూ...

సాధారణంగా మట్టి బొమ్మ పూర్తిగా తయారు కావడానికి 10 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. ఈ క్రమంలో కొన్ని బొమ్మలు జారి పడిపోతుంటాయి. వీటికి పలుమార్లు మెరుగులు దిద్దాల్సి వుంటుంది. దీంతో 2 నుంచి 4 అడుగుల వరకు బొమ్మలను బరువు తగ్గించి తయారీదారులు అచ్చులు వేస్తున్నారు. తమకు కావాల్సిన గణపతి విగ్రహాన్ని తీసుకుని ముందు, వెనుక పీవోపీతో సొంతంగా అచ్చులు తీసుకుంటున్నారు. ఈ అచ్చులతో తేలికగా మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నారు. 4 నుంచి 9 అడుగుల విగ్రహాలను మాత్రం రోజుల తరబడి ఆరగట్టి కోరిన విధంగా సిద్ధం చేస్తున్నారు. సరుగుడు కర్రలకు వరిగడ్డి, బురద పూసి తర్వాత ఊక కలిపిన మట్టితో విగ్రహాలు పూర్తి చేస్తున్నారు. విగ్రహం ఆరేకొద్దీ బరువు తగ్గుతోంది. భీమిలిలో చాలా వరకు చెరువులు కలుషితమై పోయినందున శొంఠ్యాం చెరువు మట్టిని మాత్రమే వినియోగిస్తున్నారు. ఉత్తరాంధ్రలో చాలా వరకు మట్టిబొమ్మల తయారీదారులు కాస్తయినా పీవోపీని వినియోగిస్తుండగా సంతపేటలో కల్తీ లేని మట్టిని వినియోగిస్తున్నారు.

గతంలో మట్టి బొమ్మలు మిగిలిపోయేవి..



గతంలో తయారు చేసిన మట్టిబొమ్మలు మిగిలిపోయేవి. ఆరేళ్లుగా పర్యావరణంపై చాలా మందికి అవగాహన పెరిగి మట్టి బొమ్మలే అడుగుతున్నారు. ఉత్సవ కమిటీలు కోరిన ప్రకారం డిజైన్లలో తయారు చేస్తున్నాం. దుర్గాదేవి విగ్రహాలు కూడా తయారు చేస్తున్నాం. వివరాలకు 80081 25338, 83319 36098లో సంప్రదించాలి.

– పొట్నూరు ప్రసాద్, తయారీదారుడు, సంతపేట

ముగ్గురిని అరెస్ట్ చేసిన సీబీఐ

ఎంవీపీకాలనీ: లంచం డిమాండ్ ఘటనలో సీబీఐ ముగ్గురిని అరెస్టు చేసింది. ఈ మేరకు విశాఖలోని సీబీఐ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 5వ తేదీన జాయింట్ డైరెక్టర్ జనరల్ ఫారిన్ ట్రేడ్(జేడీజీఎఫ్‌టీ) బి.ఎస్.రమేష్, మేనేజింగ్ డైరెక్టర్ పి.సీతారామరాజు, జేడీజీఎఫ్‌టీ సెక్షన్ హెడ్ శ్రీ భాష్యం వెంకట రంగనాథన్‌లను లంచం డిమాండ్, వసూలు కేసులో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపింది. కొత్త ఎగుమతి ధ్రువపత్రాలు, కన్సల్టెంట్ల పునరుద్ధరణ, సంబంధిత లైసెన్సుల జారీ కోసం డీజీఎఫ్‌టీ పలు కన్సల్టెంట్ల నుంచి భారీ మొత్తంలో లంచాలు డిమాండ్ చేసినట్లు గుర్తించింది. ఇందులో భాగంగా పై వారిని అరెస్టు చేసినట్లు తెలిపింది.

చిత్రకారుడు నరసింహాచార్యులు మృతి



నరసింహాచార్యులు (ఫైల్)

గాజువాక : ప్రముఖ సింబాలిక్ చిత్రకారుడు కె.నరసింహాచార్యులు (83) బుధవారం మృతి చెందారు. విశాఖకు చెందిన ప్రముఖ చిత్ర కళాసంస్థ చిత్ర కళాపరిషత్‌కు ప్రస్తుతం ఆయన అధ్యక్షుడిగా ఉన్నారు. రాజమండ్రికి చెందిన ప్రఖ్యాత చిత్రకారుడు ఎం.రాజాజీ వద్ద చిత్రలేఖనం నేర్చుకున్న ఆయన షిప్‌యార్డు ఉన్నత పాఠశాలలో చిత్ర కళా ఉపాధ్యాయుడిగా నాలుగు దశాబ్దాలపాటు పనిచేసి రిటైరయ్యారు. ఆయన పలు జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ అవార్డులు, బహుమతులను గెలుపొందారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గాజువాక బీసీ రోడ్‌లోని తమ స్వగృహంలో నివాసముంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. నరసింహాచార్యులు మృతికి చిత్రకారులు సుంకర చలపతిరావు, జి.కె.విశ్వనాథరాజు సంతాపం వ్యక్తం చేశారు.

భైక్‌లు దొంగలించిన కేసులో ఇద్దరికి జైలు

మల్కాపురం: వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన కేసులో ఇద్దరికి రెండేళ్లు, మరొకరికి ఏడాది జైలు శిక్షతో పాటు ముగ్గురికీ రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ 3వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.రాజేంద్ర బాబు బుధవారం తీర్పు చెప్పారు. వివరాలివీ.. అనకాపల్లి ప్రాంతానికి చెందిన భీశెట్టి మహేష్ కుమార్, నరేష్ మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో ఆరు బైక్‌లను దొంగలించారు. ఈ వాహనాలను బుచ్చయ్యపేట ప్రాంతానికి చెందిన నమ్మి రమణకు విక్రయించారు. తమ బైక్‌లు చోరీకి గురయ్యాయని వాహన యజమానులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. క్రైం ఎస్‌ఐ పల్లా దుర్గాభవానీశంకర్ దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధం ఉన్న ముగ్గురినీ అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో మహేష్, నరేష్‌కు రెండేళ్ల జైలు, రమణకు ఏడాది జైలు శిక్ష విధించారు. ఏపీపీ పి.వాణి కేసును వాదించారు.

29 నుంచి జాతీయస్థాయి డ్రాప్ రోబాల్ పోటీలు

అనకాపల్లిటౌన్: జాతీయ స్థాయి డ్రాప్ రోబాల్ క్రీడాపోటీలు ఈనెల 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘాజీయాబాద్‌లోని హైటెక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆవరణలో జరుగుతాయని డ్రాప్ రోబాల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు యల్లపు శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9441149808 అనే ఫోన్ నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

8న న్యాయవాదుల కోర్టు బహిష్కరణ

విశాఖ లీగల్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హాపూర్ కోర్టులో న్యాయవాదులపై పోలీసుల దాష్టీకాన్ని నిరసిస్తూ ఈ నెల 8న కోర్టులను బహిష్కరించనున్నట్టు విశాఖ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం కార్యదర్శి పైలా శ్రీనివాసరావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉత్తరప్రదేశ్ సంఘటనను నిరసిస్తూ కోర్టులను బహిష్కరించాలని కోరారు. ఈ నెల 4న పోలీసులు కోర్టులో న్యాయవాదులపై కిరాతకంగా లాఠీచార్జి చేసి హింసకు పాల్పడ్డారన్నారు. న్యాయవాదులకు సంఘీభావంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోర్టులను బహిష్కరించి నిరసన తెలుపుతామన్నారు.

వేళకు ఆర్టీసీ బస్సులు నడపాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

డాబాగార్డెన్స్: అన్ని డిపోల నుంచి వేళకు బస్సులు నడపాలని, ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా ప్రవర్తించి వారి మన్ననలు పొందాలని ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవి కుమార్ సూచించారు. జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం అన్ని జిల్లాల అధికారులు, డిపో మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని, ఆర్టీసీకి మరింత ఆదాయం పెంచాలని సూచించారు. నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఉక్కు అధికారికి గాయాలు

ఉక్కునగరం: రోడ్డు ప్రమాదంలో స్టీల్‌ప్లాంట్ స్టాక్ వెరిఫికేషన్ విభాగం సీనియర్ మేనేజర్ కె.ఈశ్వర ప్రసాద్‌కు గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. విధుల్లో భాగంగా బుధవారం బైక్‌పై ప్లాంట్ లోపల ఉన్న సెంట్రల్ స్టోర్స్ విభాగానికి బయల్దేరారు. హిల్‌టాప్ కూడలి వద్ద కుడి వైపు మలుపు తిరుగుతుండగా అదే సమయంలో ఉక్కునగరం జంక్షన్ నుంచి మెయిన్ గేటుకు వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో కారు, బైకులు పక్కన ఉన్న కల్వర్ట్‌లోకి దూసుకుపోయాయి. ప్రమాదంలో ఈశ్వరప్రసాద్ కుడి చెయ్యి, పక్కటెముకలకు గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అతని ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కాన్‌లో వేడుకగా శ్రీకృష్ణాష్టమి



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు, జగన్నాథ,సుభద్ర, బలభద్ర స్వామి



కృష్ణ చైతన్య మఠంలో..

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం 8 గంటల నుంచి అఖండ హరినామ సంకీర్తన మొదలైంది. అనంతరం స్వామికి అభిషేకాలు నిర్వహించారు. రాధాకృష్ణులు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వామిని పట్టు వస్త్రాలు, వివిధ వర్ణాల పూలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని శ్రీకృష్ణ లీలలను భక్తులకు వివరించారు.

గిరిజన మహిళ మృతిలో వైద్యుల నిర్లక్ష్యం లేదు

- కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గొమంగికి చెందిన కొమ్మ కాసులమ్మ(55) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. వైద్యం అందకే తన తల్లి మరణించిందని ఆమె కుమారుడు ఆరోపించగా.. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేదని కేజీహెచ్ సూపరింటెండెంట్ స్పష్టం చేశారు. పక్షవాతం, బీపీ, చాతీ నొప్పితో బాధపడుతున్న కాసులమ్మ పాడేరు ఆస్పత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం కేజీహెచ్‌లో చేరారు. ఎస్టీ సెల్ సిబ్బంది ఆమెను భావనగర్ వార్డు ఏఎంసీ యూనిట్‌లో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం ఆమె మృతి చెందారు. వెంటనే ఐటీడీఏ వాహనంలో కాసులమ్మ మృతదేహాన్ని ఆమె స్వస్థలానికి తరలించారు. కాగా.. తన తల్లికి సరైన వైద్యం అందక చనిపోయిందని ఆమె కుమారుడు, గిరిజన సంఘ నాయకుడు పృథ్వీరాజ్ ఆరోపించారు. గిరిజనులకు ఎక్కడా వైద్యం అందడం లేదని ఓ వీడియోను విడుదల చేశారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ ఘటనలో వైద్యుల నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు. బీపీ కారణంగా కాసులమ్మ మెదడులో నరాలు చిట్లిపోయి రక్తస్రావం అయిందని వివరించారు. పాడేరు ఆస్పత్రిలో కొన్ని రోజుల పాటు చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తీసుకొచ్చారని.. అప్పటికే ఆమె కోలుకోలేని స్థితిలో ఉందన్నారు. ఆమెను బతికించడానికి వైద్యులు శ్రమించినట్లు చెప్పారు. వార్డులో చికిత్స పొందుతున్న సమయంలో తాను స్వయంగా ఆమెను పరామర్శించినట్లు వివరించారు.

నేటి నుంచి రాష్ట్రీయ ఏక్తా పర్వ ఉత్సవాలు

కంచరపాలెం: కేంద్రీయ విద్యాలయం – 2 శ్రీవిజయనగర్‌లో ఏపీ సంఘటన్ ఎన్సీఈఆర్టీ – కేంద్ర విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి రాష్ట్రీయ ఏక్తా పర్వ ఉత్సవాలు, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కళా ఉత్సవ్ 2023 – 24 ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ ప్రాంతీయ స్థాయికి చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కేంద్రీయ విద్యాలయాలకు చెందిన 8 క్లస్టర్లు, 72 విద్యాలయాల్లోని సుమారు 400 మంది బాలబాలికలు నృత్యం, సంగీతం, డ్రామా, విజువల్ ఆర్ట్, టాయ్ మేకింగ్ వంటి వివిధ కళారూపాల్లో పోటీ పడనున్నట్లు తెలిపారు. ఐఎన్ఎస్ శాతవాహన కమాండ్ అధికారి, విద్యాలయ చైర్మన్ కమడోర్ రజత్, విద్యావేత్తలు పోటీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నూకాంబిక నూతన తేజం



సమావేశంలో మాట్లాడుతున్న నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ

- నేడు ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం
- వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతర నాటికి పూర్తి
- రూ.11 కోట్లతో ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ పునర్నిర్మాణం

సాక్షి, అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు గురువారం ప్రారంభమవుతున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. నిర్మాణ పనులు చకచకా చేపట్టే విధంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతర నాటికి పనులు పూర్తి చేయనున్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు ఆలయ అధికారులు, పురోహితులు పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి మొత్తం రూ.11 కోట్ల వ్యయం అవుతున్నట్లు అంచనా వేశారు. వీటిలో తొలివిడతగా రూ.3.5 కోట్లతో నూతన గర్భాలయం, అంతరాలయం, అనువెట్టి మండపం, మలివిడతలో రూ.5 కోట్లతో ప్రాకార మండపం పనులు చేపట్టనున్నారు. వీటిలో టీటీడీ నుంచి రూ.1.5 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం రూ.8.5 కోట్లతో పనులు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయి ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.11 కోట్లు ఖర్చవుతుంది. అన్నదాన సత్రంతోపాటు 100 గదులు ఉండేలా కల్యాణ మండపం నిర్మాణం చేపడుతున్నారు.

రాతి కట్టుతో గర్భాలయం : ప్రస్తుతం గర్భాలయం 14 అడుగుల వెడల్పు, 14 అడుగుల పొడవు ఉంది. 17.11 అడుగుల వెడల్పు, పొడవు ఉండేటట్టు పునర్నిర్మిస్తారు. 12, 14 వెడల్పు, పొడవుగల అంతరాలయాన్ని 17.11 అడుగుల పొడవు, 15.3 వెడల్పుతో నిర్మిస్తారు. 98 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో ఉన్న ప్రాకార మండపాన్ని రాజగోపురంతో కలిపి 175 అడుగుల పొడవు, 93 అడుగుల వెడల్పుతో నిర్మిస్తారు. రాతికట్టుతో గర్భాలయ నిర్మాణం చేపడతారు.

ఆగమ శాస్త్ర ప్రకారమే... : ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయంలో శిల్పాల నిర్మాణం ఉంటుంది. ప్రస్తుత ఆలయాన్ని క్రమేపీ తొలగిస్తూ శాస్త్ర నియమం మేరకు నూతన ఆలయాన్ని నిర్మిస్తారు. దేవాలయాన్ని మూడు భాగాలుగా విభజించి పనులు చేపడతారు. టీటీడీ చైర్మన్ హోదాలో వై.వి.సుబ్బారెడ్డి ఆలయానికి వచ్చినప్పుడు ఆలయ అభివృద్ధికి సహకారం కోరిన వెంటనే ఆయన టీటీడీ నుంచి రూ.1.5 కోట్లు మంజూరు చేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

అనకాపల్లి టౌన్: నూకాంబిక అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణ పనులను గురువారం ఉదయం 11.20 గంటలకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ చెప్పారు. ఆలయ ఆవరణలో ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం జరిగే సమయంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు.

బాలాలయంలో దర్శనాలు

800 ఏళ్ల చరిత్ర గల అమ్మవారి ఆలయాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పునర్నిర్మిస్తున్నాం. గురువారం ఉదయం 11.20 గంటలకు నూకాంబిక అమ్మవారి ఆలయంలో వైదికపరమైన ప్రక్రియను వైదికులు ఏకాంతంగా జరిపిస్తారు. అమ్మవారి మూలవిరాట్ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తాం. దేవస్థానం కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో అమ్మవారిని దర్శించవచ్చు.

– బండారు ప్రసాద్, ఆలయ ఈవో

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,000
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,500
వెండి(కిలో):	రూ.78,500

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.147
స్కిన్	: రూ.264
స్కిన్‌లెస్	: రూ.274